రికి సదువు మొదలెడితే— మన పొలాలు దున్నేదెవరు? పండించేదెవరు? ఇంట్లో పని సూసేదెవరు? నావళ్లు పట్టేదెవరు? నాకు నీళ్ళు పోసేదెవరు? నా వళ్ళు తుడిసేదెవరు?"

"వెట్టి చాకిరీ చేయడానికి మనుషులుండరనా మీ భయం!"

"కాదా మరి? ఈ పనులన్నీ ఎవరు సేత్తారు?"

"ఎవరి పనులు వాళ్ళు చేసుకొంటే తప్పులేదండి!"

దాసుగారికోపమొచ్చింది.

"ఇలాంటి వెర్రి వెర్రి ఆలోచనలు మానేయ్. నాతో ఇంత దైర్యంగామాటాడినోడింతవరకీ గడ్డమీద పుట్టలేదు. నువ్వు మా బంగారు తల్లికి ఇంగ్లీసు చెప్తావని పూరుకొంటున్నాను. ఇక అధిక ప్రసంగాన్ని ఆపి మంచి రోజు సూచి డూటీలో కెక్కు" అన్నారు తువాలు భుజాన వేసుకొని వరండాకేసి నడుస్తూ దాసుగారు.

రామరాజు ఆయన వెనకే నడుస్తూ అన్నాడు.

"కుర్రతనం. మీరు మనసులో ఏమీ పెట్టుకోకండి. కొన్ని రోజులు పోతే అతనే దారిలో పడతాడు"

దాసుగారు నవ్వేరు.

"అందుకే క్షమించేసాను. నేను పెపిడెంటునయిన కొత్తలో ఎన్నో మంచి పనులు సేద్దామనుకొన్నాను. కానీ పనులు పూర్తి సేత్తే మన మొహం సూసేవాడుండడు. అందుకనేగా ఏ రోజుకయిన ఓ పట్టాన ఏపనీ సేయందీ! ఈ కుర్రోడ్ని నువ్వే ఓ కంట కనిపెట్టు. బంగారు తల్లి మాత్రం ఇంగ్లీసు నేర్చుకోవాలి. ఇంగ్లీసు మాటల్ని సీమ టపాకాయల్ని పేల్చినట్టు పేల్చేయాలి"

"అలాగే" అన్నాడు రామరాజు.

దాసుగారు మదించిన ఆంబోతులా వరండా మెట్లు ఎక్కుతున్నాడు.

రాంబాబు పెదాలమీద నీరసంతోకూడిన ఓ చిన్న నవ్వు కదిలించింది.

రామరాజుచెయ్యి రాంబాబు భుజంపైన వేసి—

"పద" అన్నారు. రాంబాబు నిట్టూర్పుతో అడుగు ముందుకేశాడు.

**(ఇంకా వుంది)**

## మినీ కథ

### కె. భుజంగరావు



# పోషకుడు

అతన్ని ప్రతిరోజు రాత్రి ఎనిమిది గంటలకు ఎవరైనా బార్‌లో చూడవచ్చు. ఇదేం విశేషంగాదుగానీ అతనితో పాటు వచ్చే ఆ పదేళ్ళ పిల్లవాడు తప్పకుండా విశేషమే.

ఆ పిల్లవాడు అతనికి తోడుగా వస్తాడు. అంటే తండ్రి గుడ్డివాడని కాదు. దారి తెలియనివాడు అంతకన్నాకాదు. మ రెందుకు వస్తాడు?

సరే! వస్తున్నాడు.... వచ్చి ఊర్కే ఏదైనా తింటూ కూర్చుంటాడా? అబ్బే.... తండ్రితోబాటు తాగుతూ, తింటూ వుంటాడు. బహుశా ఇప్పుడు మీరుస్టన్ అయ్యారనుకుంటాను- ఇది నిన్న జరిగిన సంఘటన-

యధా ప్రకారం తండ్రి, కొడుకులు ఎనిమిది గంటలకు బార్ ప్రవేశం జేశారు—

నేను బ్రహ్మచారినీ. ఉద్యోగరీత్యా నగరంలో ఒంటరి వాడిగా వుంటున్న కారణంచేత, దగ్గరలోనే ఈ బార్ ఉండంవల్ల బిర్యానీ తినేద్దామనే ఆలోచనతో నేను వెళ్ళాను

తండ్రీ కొడుకులు ఏదో హాట్ డ్రింక్ తాగుతున్నారు. నేను భోంచేస్తున్నాను-

ఇంతలో పిల్లవాడి పెద్దకేక-

"బేరర్.... ఐస్ లావో"

నేను వెనక్కు తిరిగాను—

పిల్లవాడు నన్ను చూచాడు. నాకు నవ్వొచ్చింది-

"క్యాబాత్‌హై.... క్యాదేఖ్ రహాహై సాలే" అన్నాడు వాడు-

అదిరిపోయాను. వాడికి ఏమని జవాబు చెప్పాలి? తండ్రి వైపు చూశాను. అతను నవ్వుతున్నాడు మెచ్చుకోలుగా! నాకు నర్రున కోపం వచ్చింది- లేచి ఆ టేబుల్ దగ్గరికెళ్ళాను—

"ఏమయ్యా.... నీ కేమైనా బుద్ధుందా.... వాడేమన్నాడో విన్నావా?" అడిగాను-

"బార్‌లో ఇలాంటివి సహజం గురో.... పట్టించుకోకు" అన్నాడు తేలిగ్గా!

ఆ మాటతో నన్నునేను నిగ్రహించుకోలేక పోయాను-

"పిల్లవాడ్ని ఈ వయసులో పాడు చేస్తుంది చాలక ఇంకా సమర్ధిం పులా?" అంటూ వాడిచొక్కా పట్టి గుంజి నాలుగిచ్చేను—

ఈ సంఘటనతో బార్ అదిరిపోయింది. బార్ మేనేజర్ మా దగ్గరికొచ్చి విడిపించాడు. క్షమాపణలు చెప్పించమన్నాను-

అతను సిగ్గులేకుండా క్షమాపణలు చెప్పాడు.

బార్‌లో బిల్లు చెల్లించి బయటకు వస్తుంటే గూర్ఖా చెప్పాడు-

"వాడితో ఎందుకు పెట్టుకున్నారు సార్.... ఇలాంటి ఆడాళ్ళ బ్రోకర్లు ఇక్కడెంతో మంది వున్నారు. ఆ పిల్లవాడు వాడి కొడుకనుకున్నారు మీరు. కాదు. వాడే వీణ్ణి పోషిస్తున్నాడు. పిల్లాడు పోలీసోళ్ళ కంట్లో పడడుగదాసార్...."

ఇంకా వాడు ఏదోచెప్తున్నా నాకు వినబుద్ధియలేదు. బక్షీస్ యిచ్చేసి రూంలో కొచ్చిపడ్డాను ●